05ATP15_05ATP15.qxd 15-08-2026 PM 10:52 Page 1



# విధి నిర్వహణలో ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాలు



మంత్రి పయ్యావుల కేశవ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న సిఐ సత్యబాబు, ఎస్ఐ సురేంద్రబాబు, డాక్టర్ శ్రీవాణి

**పుట్లూరు, ఆగస్టు 15 ప్రభాతవార్త**

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించిన మండల స్థాయి అధికారులను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఘనంగా సత్కరించారు. అనంతపురం జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, ఎస్పి జగదీష్ చేతుల మీదుగా ఉత్తమ సేవలు అందించిన అధికారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా పుట్లూరు మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి, సిఐ సత్యబాబు, ఎస్ఐ సురేంద్రబాబులు విధి నిర్వహణలో చూపిన అంకితభావం, ప్రజాసేవకు గుర్తింపుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. తమ సేవలను గుర్తించి ప్రశంసా పత్రాలు అందజేయడం పట్ల అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు భవిష్యత్తులోనూ అంకితభావంతో పనిచేస్తామని వారు తెలిపారు.

## పోలీస్‌స్టేషన్లలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



టౌన్ పోలీస్‌స్టేషన్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేసిన దృశ్యం, స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సిఐ, సిబ్బంది

**తాడిపత్రిఅర్బన్, ఆగస్టు 15 ప్రభాతవార్త**

తాడిపత్రి టౌన్ పోలీస్ స్టేషన్‌తో పాటు రూరల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది క్రమశిక్షణతో పరేడ్‌లో పాల్గొని, జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ ఆరోహణరావు, పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొని దేశభక్తి, క్రమశిక్షణ, ప్రజాసేవ పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రజల భద్రత మరియు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ మరింత అంకితభావంతో పనిచేయాలని అధికారులు సిబ్బందికి సూచించారు. అనంతరం పోలీసు సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా రూరల్ పోలీస్‌స్టేషన్‌లో రూరల్ సిఐ నారాయణరెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




జెండా వందనం చేస్తున్న ఎస్ఐ సురేంద్రబాబు

**పుట్లూరు, ఆగస్టు 15 ప్రభాతవార్త**

పుట్లూరు మండల వ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్, పాఠశాలలు, గ్రామ సచివాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా స్వాతంత్రం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసి పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకున్నారు. దేశ స్వాతంత్రం కోసం మహనీయులు చేసిన త్యాగాలు, వారి సేవలను కొనియాడారు. దేశ అభివృద్ధి, సమగ్రత, ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పలువురు పిలుపునిచ్చారు. పాఠశాలల్లో విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ ప్రాధాన్యతను వివరించడంతో పాటు దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది, ప్రజలు ఉత్సాహంగా పాల్గొని జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు దేశభక్తి, జాతీయ స్ఫూర్తిని చాటేలా ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న టిడిపి నాయకులు, ఏఒ

**యల్లనూరు, ఆగస్టు 15 ప్రభాతవార్త**

యల్లనూరు మండల కేంద్రంలోనీ ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నేతలు హాజరయ్యారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు బిసి హాస్టల్‌లో జెండా ఎగురవేసి విద్యార్థులకు క్రీడా సామాగ్రిని అందజేశారు. అనంతరం సహకార సంఘం కార్యాలయం, వెలుగు కార్యాలయం, వ్యవసాయ కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ దొడ్లో రామాంజినేయులు, సింగిల్ విండో ప్రెసిడెంట్ అనిల్‌కుమార్, శింగనమల మార్కెట్ యార్డు డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్‌నాయుడు, బూత్ ఇన్‌చార్జ్ దొడ్లో హనుమయ్య, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

**యల్లనూరు, ఆగస్టు 15 ప్రభాతవార్త**

80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని యల్లనూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం జాతీయ జెండాను ఎగురవేశారు. ముందుగా తహశీల్దార్ కార్యాలయం రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ మునీంద్ర, ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ మనోహర్‌బాబు, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రామాంజనేయరెడ్డి, ఎంఆర్‌సిలో ఎంఇఒ చంద్రశేఖర్, ఎంఇఒ-2 పరమేశ్వర్‌రెడ్డి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ లోకేష్‌కుమార్, ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జాతీయ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో మంది మహనుభావుల త్యాగ ఫలితమే భారతదేశానికి స్వాతంత్రం వచ్చిందని వారు పేర్కొన్నారు.



పోలీస్ స్టేషన్ ఆవరణలో జెండా ఎగురవేస్తున్న ఎస్ఐ

## తహశీల్దార్ ఉషారాణికి ఉత్తమ సేవా పురస్కారం



మంత్రి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ఉషారాణి

**పెద్దవడుగూరు, ఆగస్టు 15 ప్రభాతవార్త**

పెద్దవడుగూరు మండల తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న పి. ఉషారాణికి ప్రభుత్వం ఉత్తమ సేవా పురస్కారాన్ని ప్రకటించింది. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ చేతుల మీదుగా తహశీల్దార్ ఉషారాణి ఈ అవార్డును అందుకున్నారు. తహశీల్దార్‌కు ఉత్తమ సేవా పురస్కారం రావడం పట్ల డిప్యూటీ తహశీల్దార్, విఆర్ఓలు, రెవెన్యూ సిబ్బంది ఆమెకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

### వి.ఆర్ రామిరెడ్డి ఆధ్వర్యంలో
## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న విఆర్ రామిరెడ్డి

**తాడిపత్రిఅర్బన్, ఆగస్టు 15 ప్రభాతవార్త**

80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను శనివారం పట్టణంలోని వైసిపి మాజీ సమన్వయకర్త విఆర్ రామిరెడ్డి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అమరులైన స్వాతంత్ర సమరయోధులకు ఘన నివాళులు అర్పించి గౌరవ వందనం సమర్పించి ప్రజలందరికీ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వి.ఆర్ రామిరెడ్డి మాట్లాడుతు దేశ స్వాతంత్ర సమర పోరాటంలో అమరులైన వీర యోధులను, దేశానికి స్వాతంత్రం ఆవిర్భవించిన ఆగస్టు 15ను మానవజాతి మనుగడ వున్నంత వరకు యావత్ సమాజం విధిగా గౌరవ వందనం సమర్పించడం సమాజ బాధ్యత అని, ఇది మన దేశ సంస్కృతి అన్నారు. కానీ నేటి సమాజంలో స్వేచ్ఛ, స్వాతంత్రం ప్రజల చేతుల్లో కాగడ పెట్టి వెతికినా కనబడే పరిస్థితి లేదన్నారు. ఈనాడు పెత్తనందారులే దేశ సార్వభౌమత్వాన్ని శాసిస్తున్న పరిస్థితులు దాపురించాయన్నారు. రాబోవు అనతి కాలంలోనే మరో ప్రజాస్వామ్య పోరాటానికి యువత నడుము బిగించి, కంకణం కట్టుకొని, పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా వుందని ఆయన పేర్కొన్నారు.

### శ్రీసరస్వతి హైస్కూల్‌లో
## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**పెద్దవడుగూరు, ఆగస్టు 15 ప్రభాతవార్త**



జెండావందనం చేస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు మండల కేంద్రంలోని శ్రీసరస్వతి హైస్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సిఐ నరేందర్‌రెడ్డి, ఎస్ఐ రాఘవేంద్రప్ప ముఖ్యఅతిథులుగా హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేసి జెండావందనం చేశారు. పిల్లలు ఉత్సాహంగా స్వాతంత్ర్య ఉద్యమ నాయకులు, భరతమాత వేషదారణలో వచ్చి దేశభక్తి గీతలు, నృత్యాలు, నాటికల ద్వారా చూపరులను ఆకట్టుకున్నారు. చిన్న పిల్లలు స్పష్టంగా ఇంగ్లీష్‌లో దేశ స్వాతంత్ర్యం గురించి మాట్లాడిన విధానం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. విద్యార్థులను సిఐ నరేందర్‌రెడ్డి, ఎస్ఐ రాఘవేంద్రప్ప, పాఠశాల కరస్పాండెంట్ మారుతిప్రసాద్ అభినందించి రేపటి భారతదేశం అన్ని రంగాల్లో ముందుండాలి అంటే నేటి విద్యార్థులే క్రమశిక్షణతో చదువుపై పూర్తి శ్రద్ధ వహించాలని పిల్లలకు సూచించారు. అనంతరం 450 అడుగుల జాతీయ జెండాను గ్రామంలో విద్యార్థులు ర్యాలీగా వెళ్లి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పిఆర్ఓ కృష్ణ, హెచ్ఎం వినయ్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పంచాయతీ రాజ్ శకటానికి తృతీయ బహుమతి

**అనంతపురం రూరల్, ఆగస్టు 15 ప్రభాతవార్త**



పర్యావరణ మంత్రినుంచి బహుమతి అందుకుంటున్న అధికారులు.

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పంచాయితీ రాజ్ డిపార్ట్మెంట్ వారు ఘన వ్యర్థనిర్వహణ మార్గ దర్శకాలపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు జిల్లా పంచాయితీ అధికారి టి. నాగరాజ నాయుడు ఆధ్వర్యంలో శకటాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ శకటాల ప్రదర్శనలో పంచాయతీరాజ్ శాఖ శకటానికి తృతీయ బహుమతి లభించింది. శకటం ఏర్పాటు చేసి, బహుమతి పొందుటకు కృషి చేసిన అనంతపురము డివిజనల్ డెవలప్మెంట్ అధికారి శకుంతలని, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సౌజన్యని, మాధవిని, అనంతపురం రూరల్ మండలం డిప్యూటీ ఎంపిడిఓ వెంకట నాయుడు ని, బుక్కరాయసముద్రం డిప్యూటీ ఎంపిడిఓ సదా శివ ని, రాప్తాడు డిప్యూటీ ఎం పి డి ఓ అశోక్ ని ,రిసోర్స్ పర్సన్ లు అంజలి, షాకీర్, నాగేంద్ర లను మరియు అనంతపురం రూరల్ మండలం పనిచేస్తున్న పంచాయితీ అభివృద్ధి అధికారులు రఘురామ్, పవన్ కుమార్,మల్లికార్జున, కంబదూరు మండ్రల పనిచేస్తున్న మహేంద్ర రెడ్డి మరియు గార్లదిన్నె మండలం పని చేస్తున్న బాల చంద్ర రెడ్డి లను మరియు వివిధ గ్రామ పంచాయతీ ల నుంచి పాల్గొన్న క్లాప్ మిత్రాలను జిల్లా పంచాయితీ అధికారి వారు అభినందించారు.

## మంత్రి చేతులు మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్న ఎంఈవి వర ప్రసాద్

**కదిరి, ఆగస్టు 15 ప్రభాతవార్త**



మంత్రి సవిత చేతులు మీదుగా ప్రశంసా పత్రాన్ని ఎంఈవి వరప్రసాద్

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కదిరి మోటారు వాహనాల అధికారి వర ప్రసాద్ జిల్లా కేంద్రంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర, బిసి సంక్షేమ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత చేతులు మీదుగా ఉత్తమ ప్రసంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రవాణా శాఖ అధికారి మాట్లాడుతూ.. వాహన దారులకు మెరుగైన సేవలను అందించి విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చడంతోపాటు బాధ్యతా యుతంగా సేవలు అందించినందుకు ఉత్తమ అధికారిగా ప్రశంసా పత్రం అందుకున్నానన్నారు. ప్రశంసా పత్రం రాకతో రెట్టింపు బాధ్యతతో తన సేవలను అందిస్తానన్నారు. ఉత్తమ అధికారిగా తనను గుర్తించిన ప్రజాప్రతినిధులకు, రవాణా శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



జెండా వందనం పలుకుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

**నల్లచెరువు ఆగస్టు 15 ప్రభాతవార్త**

మండల వ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు కార్యాలయాల్లో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మదర్సా ఏ రియాజుల్ వులుమ్ మదర్సాలు ప్రిన్సిపాల్ ఆయత్ ఖాన్ ఆహ్వానం మేరకు కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ విచ్చేసి జాతీయ జెండాను ఆవిష్కరించి జనగణమన ఆలపించారు. ఎందరో స్వతంత్ర యోధుల త్యాగ పలని స్వాతంత్రం అని. దేశ సంరక్షణకు అభివృద్ధికి ప్రతి ఒక్కరు తమవంతు కృషి చేయాలని. యువత మేధస్సును పెంపొందించుకొని సరైన మార్గంలో ముందుకెళ్లి దేశంలో సమగ్రతను సమైక్యతను పెంపొందించుకునేలా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మదర్సా నిర్వాహకులతోపాటు ఐటీడీపీ మండల అధ్యక్షుడు వర్ల భరత్ కుమార్ పాల్గొన్నారు.

## నవభారత నిర్మాణానికి యువతే కీలకం

**- వశిష్ఠ పాఠశాల కరస్పాండెంట్ పిట్టా శివశంకర్‌రెడ్డి**

**ఓబుళదేవరచెరువు, ఆగస్టు 15, ప్రభాతవార్త**



అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న శివశంకర్‌రెడ్డి

నవభారత నిర్మాణానికి యువత కీలక పాత్ర పోషించాలని వశిష్ఠ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ పిట్టా శివశంకర్‌రెడ్డి స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని వశిష్ఠ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కరస్పాండెంట్ పిట్టా శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి వందనం చేశారు. జాతీయ నాయకుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు భారత జాతీయ జెండాలతో, స్వాతంత్ర సమయరయోధుల వేషదారణలతో పురవీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్పీటిసి మాజీ సభ్యుడు పిట్టా ఓబుళరెడ్డి హజరయ్యారు. కరస్పాండెంట్ పిట్టా శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశం సమస్త కళలకు కాణాచి అన్నారు. భారత దేశ సంపదను కొల్లగొట్టాలనే కుట్రతో ఆంగ్లేయులు వర్తకులుగా భారతదేశానికి వచ్చారన్నారు. మన దేశ సంపదను, సహజ, ఖనిజ సందపను బ్రిటన్‌కు దోచుకువెళ్లారన్నారు. వారి నిరంకుశ పాలనను అంతం మొందించేందుకు ఎందరో భారతీయులు స్వాతంత్ర పోరాటంలో అశువులు బాసారన్నారు. వారి త్యాగఫలమే నేటి ఈ స్వాతంత్రం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షరీఫ్, వెంకటనారాయణ, అమానుల్లా, మోహన్‌రెడ్డి, రెడ్డిరమణ, వంశీకృష్ణ, నలిని, పూజ, సాహిస్తా, పవిత్ర, హారిలు పాల్గొన్నారు.

## ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**తనకల్లు, ఆగస్టు 15 ప్రభాతవార్త**



జాతీయ పతాకాలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో శనివారం 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు ఈ సందర్భంగా కొక్కంటి క్రాస్‌లో చైతన్య విద్యా సంస్థ కరస్పాండెంట్ తలమర్ల పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పురవీధుల్లో జాతీయ పతాకాలతో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగఫలం చేత మన భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్రం లభించిందన్నారు. స్వాతంత్ర సమరయోధులు అందరికి మన జాతి తరపున యువత భారతదేశ ప్రజల తరపున వారికి ఘన నివాళుర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వారి బాటలో మనమంతా నడవాలని భారత దేశ పౌరులుగా నడవాలని భారతదేశ గౌరవాన్ని ప్రతిష్టను ఇనుమడింప చేయాలని ఈ సందర్భంగా దేశ నాయకుల ఫోటోలతో ర్యాలీ చేపట్టారు. హాజరైన విద్యార్థులకు మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ అవార్డులు అందుకున్న ఎఇ, లైన్‌మెన్లు



ప్రశంసాపత్రాలను అందుకుంటున్న దృశ్యం

**అమడగూరు, ఆగస్టు 15 ప్రభాతవార్త**

అమడగూరు మండలం ట్రాన్స్‌కో ఏఇగా విధులు నిర్వహిస్తున్న చంద్రనాయక్‌తో పాటు లైన్‌మెన్లు శివాజీ, హరి, విశ్వనాథ్‌రెడ్డి, ఆపరేటర్ హరిబాబులు కదిరి డిఇ కృష్ణదేవ చేతుల మీదుగా ఉత్తమ అవార్డులు అందుకున్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వారికి ప్రశంసా పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా వారి సేవలను తోటి అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు అభినందించారు.

## మహనీయుల ఆశయాలను కొనసాగిస్తాము

**కక్కులపల్లి క్లస్టర్ గ్రేడ్ I పంచాయతీ అభివృద్ధి అధికారి హిదయతుల్లా**



కక్కలపల్లి కాలనీలో స్వతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

**అనంతపురం రూరల్, అగస్ట్ 15,ప్రభాతవార్త**

భాతరదేశానికి స్వతంత్రం తీసుకవచ్చినమహనీయుల ఆశయాలను కొనసాగిస్తామని ఎంపిటిసి రత్నమ్మ, కక్కలపల్లి క్లస్టర్ గ్రేడ్1 పంచాయితీ అభివృద్ధి అధికారి యు.హిదయతుల్లా, టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం అనంత రూరల్ మండలం కక్కలపల్లి కాలనీలోని సచివాలయం 1 లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా భారతదేశానికి స్వతంత్రం తీసుకవచ్చినమహనీయుల చిత్రపటానికిపూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించి జాతీయజెండానుఎగరవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో మంది మహనీయులు బ్రిటీష్ వారితో పోరాటాలు చేయడం వలనే మనం ఇవ్వాల స్వసంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించు కోవడం జరుగుతుందన్నారు. నేటి సమాజంలోని యువత మహనీయుల ఆశయాలను ఆసరగా తీసుకుని వారి అడుగుజాడలలో నడవలన్నారు. ఈకార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, టిడిపినాయకులు,పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలి

**అనంతపురం రూరల్, అగస్ట్ 15 ప్రభాతవార్త**



సిండికేట్‌నగర్‌లోని ఎంపీపీ స్కూల్లో స్వతంత్ర దినోత్సవ వేడుకలు నివసిస్తున్న దృశ్యం

దేశం కోసం పాటుపడిన స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ముందుకు సాగలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలి పారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని శనివారం అనంతపురం రూరల్ మండలం సిండికేట్ నగర్ ఎంపీపీ స్కూల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయురాలు, జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పిల్లలకు స్వీట్లు పంచి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్ దాస్యశృంఖలాల నుంచీ భారతావని స్వేచ్ఛావాయువులు పీల్చినప్పటి నుండీ నేటి వరకు ప్రపంచ దేశాలు మన దేశం వైపు చూసేలా అన్ని రంగాల్లో ఎదగడం జాతి యావత్తు గర్వించదగ్గ విషయమన్నారు. భిన్నత్వంలో ఏకత్వం సాధించిన ఘనత మనకే దక్కుతుందన్నారు. స్వాతంత్రం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరులను గుర్తు చేసుకుని వారి ఆశయాలను ఆదర్శంగా చేసుకుని ముందుకు సాగుదాం అన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిండికేట్ నగర్ ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు వరప్రసాద్,ఉపాధ్యాయులు సరోజమ్మ, తులసమ్మ, హేమలత, పావని లక్ష్మి, పిల్లలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా
## 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**అనంతపురం రూరల్, అగస్ట్ 15 ప్రభాతవార్త**



ఎంపీడీఓ కార్యాలయంలో స్వతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉదయం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఎంపీపీ వరలక్ష్మి ఆధ్వర్యంలో ఎంపీడీవో దివాకర్, మండల అధికారులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలవేస నివాళులర్పించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహనీయుల త్యాగఫలం, పోరాటం వలనే మనకు స్వతంత్ర భారతం వచ్చిందని . కావున నేడు మనందరం స్వాతంత్ర్య సమర యోధులను స్మరించుకోవడం జరుగుతుందన్నారు. మహనీయుల ఆశయాలను కొనసాగించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి అన్నారు. అనంతరం ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చియ్యేడు కృష్ణారెడ్డి,జడ్పిటిసి చంద్రకుమార్, ఎంఈఓ వెంకటస్వామి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



తహశీల్దార్ కార్యాలయం ముందు జెండా ఎగురవేస్తున్న దృశ్యం

**అమడగూరు, ఆగస్టు 15 ప్రభాతవార్త**

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం అమడగూరు మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమడగూరు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మారుతిప్రకాష్, ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ శకుంతల, జెడ్‌పిహెచ్ పాఠశాల, ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ పాఠశాల, పోలీస్ స్టేషన్, తదితర కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేసి జెండావందనం చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మారుతీప్రకాష్, ఎంపిడిఓ శకుంతల, ఎంఈఓ జిలాన్‌బాష మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం మహనీయులు చేసిన త్యాగాలను, వారి సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధులను ఆదర్శంగా తీసుకుని వారి అడుగుజాడల్లో నడవాలని, దేశ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, ఎంపిడిఓ కార్యాలయాల సిబ్బంది, జెడ్‌పిహెచ్ ప్రధానోపాధ్యాయులు రమణారెడ్డి, సిబ్బంది, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శిరీష, సిబ్బంది, కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటరమణమ్మ, సిబ్బంది, మండల స్టోర్ డీలర్లు పాల్గొన్నారు.

### ఘనంగా కలిగొలిమి ప్రాథమిక పాఠశాలలో
## 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**నంబులపూలకుంట, ఆగస్టు 15 ప్రభాతవార్త**

కలిగొలిమి ప్రాథమిక పాఠశాలలో 80 వ స్వాతంత్ర దినోత్సవంసందర్భంగా ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయుడు మంజునాథ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వాతంత్రం సాధించిన మహానేతల గూర్చి వివరించారు. అనంతరం విద్యార్థులు వివిధ రకాల వేషధారాలతో వచ్చి అందరినీ అలరించారు. అనంతరం చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టు కున్నాయి.

## త్రివర్ణ పతాకాలతో కదిలిన కల్లూరు..

### హర్ ఘర్ తిరంగాతో వెల్లివిరిసిన దేశభక్తి..



హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, మహిళలు, గ్రామస్థులు.

**గార్లదిన్నె, ఆగస్టు 15, ప్రభాతవార్త:**
స్వాతంత్ర్య దినోత్సవ వేళ గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామం త్రివర్ణ పతాకాలతో సందడిగా మారింది. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీకి గ్రామస్తులు, విద్యార్థులు, మహిళలు, ఉపాధ్యాయులు, మాజీ సైనికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.మండల బీజేపీ అధ్యక్షుడు శీలం చాణిక్య నేతృత్వంలో శ్రీ విశ్వవాణి పాఠశాల నుంచి సంజీవరెడ్డి కూడలి వరకు ర్యాలీ సాగింది. జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలతో పాల్గొన్న ప్రజలతో ప్రధాన వీధులు మార్మోగాయి.ఈ సందర్భంగా చాణిక్య మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు ప్రతి ఇంటా జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు యువత ముందుండాలని కోరారు.త్రివర్ణ పతాకాల రెపరెపలు, దేశభక్తి నినాదాలతో కల్లూరులో పండుగ వాతావరణం నెలకొంది.

## దేశ పురోగతికి బాధ్యతగా కృషి చేయాలి

- రెపరెపలాడిన మువ్వన్నెల జెండా
- పామిడిలో వైభవంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**పామిడి ఆగస్టు 15: ప్రభాతవార్త**



గ్రామపంచాయతీ కార్యాలయంలో మహాత్మాగాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం



జాతీయజెండాను ఎగురవేస్తున్న సంతోష్ రెడ్డి.

దేశ పురోగతి శాంతి ఐక్యతకు ప్రతిఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని అధికారులు నాయకులు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రైవేట్, కార్యాలయాలు, పాఠశాలల్లో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎక్కడచూసినా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. విద్యార్థినీ విద్యార్థులు త్రివర్ణపతాకాన్ని తమతమ గుండెల పై ఉంచుకుని దేశంపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. పోలీసుస్టేషన్ నందు సిఐ శివశంకర్ నాయక్, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ షర్మిల, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భోగాతి మురళీమోహనరెడ్డి, ఎంపీడీఓ ప్రభాకర్, మండల విద్యాధికారి కార్యాలయంలో ఎంఈఓలు జయానాయక్, సత్యనారాయణ, పామిడి గ్రామ పంచాయతీ కార్యాలయం నందు కార్యదర్శి శివమూర్తి, టిడిపి నాయకులు జింకల సంజీవకుమార్, బొమ్మా మోహన్, కత్రిమల ప్రభాకరాచౌదరీ, బొల్లు శ్రీనివాసరెడ్డి, కొట్టం మాలిక్, గౌసుపీర, సామాజిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యాధికారి డాక్టర్ మహేష్, అభివృద్ధి కమిటీ సభ్యులు చిలకల రాజగోపాల్, ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం నందు ఏఈ మధుసూదన్, వ్యవసాయ కార్యాలయంలో ఏఓ విజయ్ కుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గురుప్రసాద్, అధ్యాపకులు నారాయణరెడ్డి, ఎన్ఎస్ఎస్ పిఓ అక్కులన్న, కస్తూర్బా పాఠశాలలో ఎస్ఓ సౌభాగ్యలక్ష్మి, ఆదర్శ పాఠశాలలో అనురాధ, ఖాదరపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పురుషోత్తంబాబు, ఉపాధ్యాయులు రామ్మోహన్, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శులు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జాతీయజెండాను ఎగురవేశారు. శ్రీ చైతన్య టెక్నోలో సిఈఓ సంతోష్ రెడ్డి, డైరెక్టర్ రమణారెడ్డి, శ్రీ నలందలో డైరెక్టర్ రవి, శ్రీసరస్వతీ విద్యామందిరంలో ప్రాదానాచార్యులుశ్రీనివాస్, కృష్ణవేణిలో నిర్వాహకురాలు అనురాధస్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఆయపాఠశాలల్లో విద్యార్థినీలు విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆలపించిన గేయాలు పలువురిని ఆకట్టుకున్నాయి. తోటి వారికి సహాయపడే గుణాన్ని అలవర్చుకుని ముందుకు సాగినప్పుడే మానవ జన్మ ధన్యం అవుతుందన్నారు. యువత ఒక ఉన్నతమైన లక్ష్యంతో ముందుకెళ్తూ దేశాభివృద్ధికి కృషి చేయాలని తెలియజేస్తూ దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిన మహనీయుల సేవలను కొనియాడారు.

## గార్లదిన్నె గ్రంథాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు..



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తూవిద్యార్థులు

**గార్లదిన్నె, ఆగస్టు 15, ప్రభాత వార్త:**
శాఖా గ్రంథాలయం గార్లదిన్నెలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.అలాగే మే నెలలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ సందర్భంగా ఉత్తమ గ్రంథాలయాధికారిణిగా గార్లదిన్నె గ్రంథాలయాధికారిణి కె.యం. శిరీష ఎంపికయ్యారు. అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థలో అధ్యక్షులు వెంకట్, జె. శివప్రసాద్ చేతుల మీదుగా ఆమెకు అవార్డు ప్రదానం చేశారు.

## గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు..

**గార్లదిన్నె, ఆగస్టు 15,ప్రభాత వార్త :**
గార్లదిన్నె మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్సై ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొని జాతీయ పతాకానికి వందనం చేశారు. అనంతరం దేశ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు.



గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎస్సై, పోలీసు సిబ్బంది, విద్యార్థులు

## ఘనంగా గ్రంథాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



గ్రంథాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న చైర్మన్ వడ్డే వెంకట్

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 15 ప్రభాతవార్త**
80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అనంతపురం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉమ్మడిజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్‌తో జాతీయ పతాకం ఆవిష్కరణ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎందరో త్యాగధనుల త్యాగం వల్ల మనదేశానికి లభించింది అని గుర్తు చేసారు. శింగనమల గ్రంథాలయాధికారిగా పనిచేయు చున్న జి.కృష్ణకి, గార్లదిన్నె గ్రంథాలయాధికారిగా పనిచేయుచున్న కేఎం శిరీషాకి అవార్డులను ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జె.శివ ప్రసాద్ డిప్యూటీ లైబ్రరియన్ పి.కమ్మన్న, సహా గ్రంథాలయాధికారి డి.గోవిందు సీనియర్ అసిస్టెంట్ రాజు, జూనియర్ అసిస్టెంట్ రామాంజినమ్మ, సిబ్బంది జీవన, ఇందిరమ్మ, శిరీషా, విజయ సరస్వతమ్మ, గంగాధర్, ముత్యాలమ్మ మొదలగు వారు పాల్గొన్నారు.

## బృహస్పతి విద్యానికేతన్ స్కూల్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో చిన్నారులు

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 15 ప్రభాతవార్త**
బృహస్పతి విద్యానికేతన్ స్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత ఉత్సాహంగా నిర్వహించి, భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో విద్యార్థులు ప్రదర్శించిన 100 అడుగుల జాతీయ జెండా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేశభక్తిని చాటేలా సాగిన ఈ ఊరేగింపు అందరినీ ఆకట్టుకుంది. ఈ భారీ జాతీయ జెండా ప్రదర్శన ర్యాలీ స్కూల్ ఆవరణ నుండి ప్రారంభమై, టవర్ క్లాక్ మీదుగా తిరిగి స్కూల్ ఆవరణకు చేరుకుంది. ఈ వేడుకల్లో స్కూల్ కరెస్పాండెంట్ రవిశంకర్ ప్రసాద్, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, ముఖ్య అతిథులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య ఎటిపి-I బ్రాంచ్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



వివిధ వేషధారణలతో చిన్నారులు

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 15 ప్రభాతవార్త**
శ్రీచైతన్య ఎటిపి-1బ్రాంచ్‌లో ఎజిఎంసుబ్బారెడ్డి అకాడమీ కోఆర్డినేటర్ ఇర్షాద్ జోనల్ ఏవో గోపాల్, ప్రైమరీ ఇన్చార్జ్ పూజ ఆధ్వర్యంలో శనివారం మన దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా, ఉత్సాహంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెండా వందనం అనంతరం జాతీయ గీతాలాపన చేసి, దేశం కోసం ప్రాణాలర్పించిన మహాత్మా గాంధీ, భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్ జవహర్ లాల్ నెహ్రూ సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎంతో మంది స్వాతంత్ర సమరయోధుల అమర వీరుల త్యాగాలను ఘనంగా స్మరించుకున్నాము. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ ఇర్షాద్, జోనల్ ఏవో గోపాల్, ప్రైమరీ ఇంచార్జ్ పూజ, అకాడమీ డీన్లు చిరంజీవి, సుప్రజ, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సాయివిజ్ఞాన్ పాఠశాల నందు ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు



స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 15 ప్రభాతవార్త**
స్థానిక 3వ రోడ్డులో ఉన్న సాయి విజ్ఞాన్ పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ మెడికల్ కళాశాల డిసిహెచ్ అసిస్టెంట్ ప్రొ. డాక్టర్ శంకర్ నారాయణ్ ఎంబిబిఎస్, ఎండి (పీడియాట్రిక్స్) కార్యదర్శి అనంతపురం, సాయి విజ్ఞాన్ గౌరవ డైరెక్టర్లు ఎం.పి.శ్రీనివాసులు, సి.కరుణాకర్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.లావణ్య రామ్ పాల్గొన్నారు. విద్యార్థిని విద్యార్థులతో దేశభక్తి గీతాలు నృత్యాలు,పిరమిడ్స్, డ్రామాలు, ఉపన్యాసాలు తదితర యాక్టివిటీస్ చేయించడం జరిగింది.చివరగా గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను అందచేసి మిఠాయిలను పంచి పెట్టి కార్యక్రమాన్ని ముగించడం జరిగింది.

## గుమ్మేపల్లిలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**శింగనమల, ఆగస్టు 15 ప్రభాతవార్త**
మండల పరిధిలోని గుమ్మేపల్లి గ్రామంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయితీ రాజ్ ఛాంబర్ కార్యనిర్వహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ స్పెషల్ ఆఫీసర్ అక్బర్, పంచాయితీ కార్యదర్శి లీలావతి, ప్రదానోపాధ్యాయులు రవినాయక్, దేగల శ్రీనివాసులు, కురుబ ఓబుళపతి, కృష్ణమూర్తి, కోయగూర పెద్దన్న, రమేష్, శివయ్య, మల్లికార్జున, ఓబుళపతి, గోవర్ధన్‌రెడ్డి, సూర్యనారాయణ, ఆచారి, పంచాయితీ కార్యాలయ సిబ్బంది పాల్గొనా న్నరు.



జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న దేగల కృష్ణమూర్తి

## సాఫ్ట్‌బాల్ క్రీడలో అత్యుత్తమ ప్రతిభ

### అక్షయ్ సాగర్‌కు బెస్ట్ పెర్ఫార్మర్ అవార్డు



అక్షయ్ సాగర్ బెస్ట్ పెర్ఫార్మర్ అవార్డు అందుకున్న దృశ్యం

**రాప్తాడు ఆగస్టు 15 ప్రభాతవార్త**
సాఫ్ట్‌బాల్ క్రీడలో విశేష ప్రతిభ కనబరిచిన బుడగల అక్షయ్ సాగర్ ఖిబెస్ట్ పెర్ఫార్మర్ ఆఫ్ ది ఇయర్ 20252026ఖి అవార్డును అందుకున్నారు. కాకినాడ సమీపంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో శనివారం ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా వైభవంగా నిర్వహించిన కార్యక్రమంలో, వర్సిటీ ప్రోఛాన్సలర్ సతీష్ రెడ్డి చేతుల మీదుగా అక్షయ్ సాగర్ ఈ జ్ఞాపికను స్వీకరించారు. అనంతపురం జిల్లా రాప్తాడు విశాలాంధ్ర సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాస్, కీర్తిశేషులు ఉమాదేవి దంపతుల కుమారుడైన అక్షయ్ సాగర్ సాధించిన ఈ విజయం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, యూనివర్సిటీ యాజమాన్యం అక్షయ్ తండ్రి శ్రీనివాస్‌ను వేదికపై శాలువాతో ఘనంగా సన్మానించింది. క్రీడల్లో విద్యార్థులు రాణించేలా తల్లిదండ్రులు ఇచ్చే ప్రోత్సాహం ఎంతో అభినందనీయమని ప్రో ఛాన్స్ లర్ సతీష్ రెడ్డి కొనియాడారు. క్రీడల్లో రాణిస్తూ కళాశాలకు, రాప్తాడు ప్రాంతానికి మంచి పేరు తెస్తున్న అక్షయ్ సాగర్‌ను వర్సిటీ అధ్యాపకులు, తోటి విద్యార్థులు, స్థానిక ప్రముఖులు, ప్రజలు అభినందించారు.

## జిల్లా టాపర్లకు నగదు ప్రోత్సాహకాలు..



ప్రతిభ చాటిన విద్యార్థినిని పోలీస్ కానిస్టేబుల్, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించి అభినందించారు.

**గార్లదిన్నె, ఆగస్టు 15 ప్రభాతవార్త**
80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పదో తరగతి పరీక్షల్లో అనంతపురం జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి టాపర్లుగా నిలిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ మండల విద్యాశాఖ అధికారి తారాచంద్రనాయక్, స్కూల్ కమిటీ చైర్మన్ ఎర్రిస్వామి, నాయకులు సుధాకర్ రెడ్డి, పూర్వ విద్యార్థులు, గ్రామ ప్రముఖులు అభినందనలు తెలిపారు.విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో పోలీస్ కానిస్టేబుల్‌రవి నగదుప్రోత్సాహకాలను అందజేశారు. మొదటి బహుమతిగా రూ.10,000ను ఎరువు ఓబులేసు కుమారుడు రవి, రెండో బహుమతిగా రూ.7,000నుహాజీ,మూడోబహుమతిగారూ.5,000నుబాషా అందజేశారు. విద్యార్థులు సాధించిన ప్రతిభకుగుర్తింపుగా నగదు బహుమతులు అందించడం పట్ల పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో ఉన్నత చదువుల్లోనూ రాణించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు.

## ప్రతి బిడ్డకు విద్యాబుద్ధులు నేర్పాలి..ఎంపీపీ సునీత



సమావేశంలో మాట్లడుతున్న ఎంపీపీ సునీత

**బుక్కరాయసముద్రం ఆగస్టు 15 ప్రభాతవార్త**
ప్రతి బిడ్డకు విద్యాబుద్ధులు నేర్పాలని తల్లిదండ్రులను ఎంపీపీ సునీత కోరారు.శనివారం బుక్కరాయసముద్రం పంచాయితీ పరిదిలోని జనచైతన్య కాలనిలో మాల్బార్ జెవెల్లరీ చారిటీ సంస్థ ఆధ్వర్యంలో సి.యస్.ఆర్.కింద ఫ్రీట్యూషన్ మిని అంగన్వాడి కేంద్రం తరుపున నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎంపీపీ దాసరి సునీత ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లడుతూ బుడుగు బలహీన వర్గాలకు విద్యాబుద్ధులు అందేలా మలబార్ సంస్థ చారిటీ కృషిచేయడం చాలా సంతోష వ్యక్తంచేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోపాటు,టిడిపి నాయకులు బుల్లె నారాయణస్వామి,మైనార్టీ నాయకులు బాబాఫక్రుద్దీన్‌వలి, మలబార్ సంస్థ ప్రతినిధులు మహేష్,సిరాజ్, కాలనివాసులు షేక్ జుగ్ను,సాకే లక్ష్మిదేవి,యం లక్ష్మిదేవి, తదితరులు పాల్గొన్నారు.

## నూతన షో రూమ్‌ను ప్రారంభించిన ట్రెండ్స్..




ట్రెండ్స్ నూతన షోరూమ్

**అనంతపురం కల్చరల్, ఆగస్టు 15 ప్రభాతవార్త**
రిలయన్స్ రిటైల్‌కు చెందిన, భారతదేశంలోనే అతిపెద్ద, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దుస్తుల, అనుబంధ ఉత్పత్తుల ప్రత్యేక విక్రయ సంస్థ ట్రెండ్స్, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా, గుంతకల్ పట్టణంలో తమ నూతన స్టోర్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది. మెట్రోలు, మినీమెట్రోల నుండి టైర్-1, టైర్-2 పట్టణాలు, ఆ పై ప్రాంతాల వరకు తమ పరిధిని విస్తరించటం ద్వారా భారతదేశంలో ఫ్యాషన్‌ను అందరికీ ట్రెండ్స్ అందుబాటులోకి తెస్తోంది. ఇప్పుడు ఇది దేశంలోనే అత్యంత ఆదరణ పొందిన ఫ్యాషన్ షాపింగ్ గమ్యస్థానంగా నిలిచింది. రైల్వే స్టేషన్ రోడ్, వివి నగర్, గుంతకల్‌లోని ఈ ట్రెండ్స్ స్టోర్ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కలిగి ఉంది. మహిళలు, పురుషులు, పిల్లల కోసం ట్రెండీ వస్త్రాలు, ఫ్యాషన్ యాక్సెసరీలను ఆకర్షణీయమైన ధరలకు కొనుగోలు చేస్తూ ఒక ప్రత్యేకమైన, అద్భుతమైన షాపింగ్ అనుభవాన్ని పొందవచ్చు.

## ఇన్ సర్వీర్వీస్ ఉపాధ్యాయుల టెట్ మినహాయింపు ఇవ్వాలి- వైయస్సార్‌టిప నేతలు



మాట్లాడుతున్న వైఎస్ఆర్ టిపి నేతలు

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 15 ప్రభాతవార్త**
కేవలం ఉపాధ్యాయ సమస్య టెట్‌ను కేంద్ర విద్యా శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని ప్రయత్నించిన ఉపాధ్యాయ నేతలను సస్పెండ్ చేయడం దారుణమని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.నాగిరెడ్డి, శ్రీధర్ గౌడ్ అభిప్రాయపడ్డారు. అక్రమంగా సస్పెండ్ చేసిన ఉపాధ్యాయుల వివరణ తీసుకొని సస్పెన్షన్ తక్షణమే ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటరమణప్ప, రవీంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు విశ్వనాథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఓపిరెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, రమణారెడ్డి, నారాయణరెడ్డి, సత్యనారాయణరెడ్డి, లక్ష్మికాంత్ రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మండల వ్యాప్తంగా ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ తహశీల్దారు

**శింగనమల, ఆగస్టు 15 ప్రభాతవార్త**
మండల వ్యాప్తంగా శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దారు సి.నిరోశ, విఆర్ఓ తాతయ్య, ఏఎస్ఐలు చితంబరప్ప, అశోక్, తిమ్మరాజు, ఎంఈఓ కార్యాలంలో ఎంఈఓ నరసింహరాజు, శివ ప్రసాద్, వ్యవసాయ కార్యాలయంలో ఎంపిడిఓ భాస్కర్, టిడిపి మండల కన్వీనర్ గోరంట్ల మారుతినాయుడు, సింగిల్ విండో అధ్యక్షులు గుర్రం లక్ష్మినారాయణ, మాజీ మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, రాష్ట్ర పంచాయితీ రాజ్ ఛాంబర్ కార్యనిర్వహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి, మాసుల్ చంద్రమోహన్, చంద్రాయుడు, ఎంపిఈఓ ఉమాలు పాల్గొన్నారు. సొసైటీ కార్యాలయంలో సింగిల్ విండో అధ్యక్షులు గుర్రం లక్ష్మినారాయణ, డైరెక్టర్ బాలరాజు, రాష్ట్ర పంచాయితీరాజ్ కార్యనిర్వహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి, కుళ్లాయప్ప, సి.వెంకటేష్, చెంద్రాయుడు, కార్యాలయ సిబ్బంది, సిఐఓ నారాయణస్వామి, జీలాన్, కోయగూర పెద్దన్న, కుళ్లాయప్ప, సత్యనారాయణ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఎంపిడిఓ కార్యాలయం వద్ద ఎంపిపి యోగేశ్వరి, ఎంపిడిఓ భాస్కర్, ఏఓ నాగభూషన్‌రెడ్డి, ఏపిఓ భాగ్యలక్ష్మి, కార్యాలయ సిబ్బంది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. శింగనమల పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కె.ప్రసాద్, సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రర్ గురునాథ్ జెండా ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు.

## ఉద్యానవన శాఖ అధికారిని శైలజ కు ఉత్తమ అవార్డు

**బుక్కరాయసముద్రం ఆగస్టు 15 ప్రభాతవార్త**



ఉత్తమ అవార్డు అందుకుంటుంన్న ఉద్యానవనశాఖ అధికారి శైలజ

బుక్కరాయసముద్రం మండల ఉద్యానవన శాఖ అధికారిణి శైలజ కు ఉత్తమ అవార్డును ఆగష్టు 15 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగ శనివారం అనంతపురం జిల్లా పేరెంట్ గ్రౌండ్లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక వాణిజ్య పన్నులు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చేతులమీదుగా శైలజ కు ఉత్తమ సేవలకు అవార్డు ప్రశంసా పత్రాలను అందుకున్నారు.ఈ సందర్భంగ శైలజ కు మండల అధికారులు,రైతులు వారిని అభినందించారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




జెండా ఆవిష్కరణ చేస్తున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సునీత

**బుక్కరాయసముద్రం ఆగష్టు 15 ప్రభాతవార్త**
బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు.మండల తహశీల్దార్ కార్యాలయంలో తమశీల్దార్ శ్రీదర్‌మూర్తి,ఎంపిడివో కార్యాలయంలో ఎంపిడివో సాల్మన్,సింగిల్‌విండో కార్యాలయంలో సింగిల్విఇండో అధ్యక్షుడు కేశన్న, వ్యవసాయశాఖ కార్యాలయంలో ఎఓ శ్యామ్‌సుందర్‌రెడ్డి,పోలీసుస్టేషన్‌ల్లో సిఐ సుబ్బరాయుడు, తోపాటు వివిధ ప్రభుత్వ కార్యాలయంల్లో, అధికారులు,ప్రభుత్వ పాఠశాల్లో ఉపాధ్యాయులు,డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల నందు ప్రిన్సిపాలన సునీత,కెజిబివిలో ఎస్ఓ నాగవేణి, ప్రవేట్ పాఠశాలలు అనంతవిద్యానికేతన్ స్కూల్‌ల్లో కరస్పాండెంట్ నాయుడు,వాణి స్కూల్‌నంద్ రామమూర్తి,ఎస్ఎల్ఎన్ఎస్ నందు శ్రీనివాసురెడ్డి జెండా ఆవిష్కరణచేశారు.అనంతరం వారు మాట్లడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధలను స్మరించుకున్నారు.దేశంకోసం వారు చేసిన త్యాగాలు,నిస్వార్థ సేవలు అమూల్యమైన కృషిని గుర్తుచేసుకున్నారు.

## నిర్మలా పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు..

### విద్యార్థులు ఉన్నత విద్యతో పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలి: కేశవరెడ్డి - విజ్డమ్ సిటీగా పెనకచర్ల డ్యాం:పాఠశాల చైర్మన్ హైదర్‌వలి.



నిర్మలా కాన్వెంట్ పాఠశాలలో స్వాతంత్ర్య వేడుకల్లో కేశవరెడ్డి.

**గార్లదిన్నె, ఆగస్టు 15,ప్రభాత వార్త**
గార్లదిన్నె మండలంలోని పెనకచర్ల డ్యాంలోని నిర్మలా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ముంటిమడుగు కేశవరెడ్డి మాట్లాడుతూ.. తాను విద్యాభ్యాసం చేసిన పాఠశాలకు తనే ముఖ్య అతిథిగా హాజరు కావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి, తాము చదివిన పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అదేవిధంగా పాఠశాల చైర్మన్ హైదర్‌వలి మాట్లాడుతూ.. పెనకచర్ల డ్యాంను 'విజ్డమ్ సిటీ'గా రూపొందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.అనంతరం పాఠశాలలో నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ముంటిమడుగు కేశవరెడ్డి బహుమతులను అందజేశారు. అనంతరం పాఠశాల యాజమాన్యం కేశవరెడ్డిని ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

